క్లుప్తంగా

రామలింగేశ్వరునికి అభిషేకాలు



నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర సాల గ్రామ శివలింగానికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పూజలు జరిపారు. పలువురు భక్తులు కృష్ణవేణమ్మ విగ్రహానికి హారతులిచ్చారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్యానంలో శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. 15వ రోజు సోమవారం పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులతో ఉపాధ్యాయిని విజయ ధ్యానం చేయించారు. అనంతరం భగవద్గీత 12వ అధ్యాయంలోని 12వ శ్లోకాన్ని నేర్పించారు. ఉపాధ్యాయిని దుర్గాభవానీ గణితం నేర్పించారు. విద్యార్థులతో మైండ్ గేమ్ ఆడించి వారిలో సృజనాత్మకతను పెంపొందించారు. సరస్వతి పూజ, పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, యోగా చేయించి భగవద్గీత శ్లోకాలు, డ్రాయింగ్ నేర్పించారు. కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

నూతన వస్త్రాల పంపిణీ



నాగాయలంక: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సౌజన్యంతో 50 మంది వృద్ధులు, దివ్యాంగులకు సోమవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన గునుకుల చంద్రశేఖర్, అనూష దంపతులు వీటిని సమకూర్చారు. స్థానికులు పొన్నపల్లి శ్రీకాంత్, ప్రశాంతి దంపతుల ఆర్థిక సహకారంతో వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం చేశారు.

స్టేట్ సెకండ్ ర్యాంకర్ తేజస్వంత్‌కు సన్మానం



అవనిగడ్డ: పదో తరగతి ఫలితాల్లో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించిన మోపిదేవి మండలం కె కొత్తపాలెంకు చెందిన దుట్టా తేజస్వంత్‌ను ఎస్ఎంహెచ్ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక కార్యాలయంలో సోమ వారం జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మత్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చల్లపల్లి శ్రీ చైతన్యలో చదివిన తేజస్వంత్ 600కి 596 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించి దివిసీమకు ఖ్యాతిని తీసుకొచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి తేజస్వంత్ తల్లిదండ్రులు అమర్‌చంద్-వెంకటేశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. న్యాయవాది దామెర్ల నాగరాజు, ఫౌండేషన్ సభ్యుడు చంద్రశేఖర్, భోగిరెడ్డి ఆదినారాయణ, నాగప్రతీప్, రాజీవ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం

పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మచిలీపట్నం వచ్చారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని హెలిప్యాడ్ వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయస్వాగతం పలికి సన్మానించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సీఎం వైఎస్ జగన్‌కు మెమెంటో అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి జోగి రమేష్; జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక











సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు; ఎస్పీ పి. జాషువా; అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు; రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్; పేర్ని కిట్టు

సంబరం.. సాక్షాత్కారం

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రజల చిరకాలవాంఛ బందరు పోర్టు నిర్మాణ పనులను సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. తమ కలను సాకారం చేస్తున్న అభిమాన నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఊరూవాడా కదలివచ్చి ముఖ్యమంత్రిని చూసి సంబరపడిపోయారు. హెలీకాప్టర్‌లో ఉదయం 10.18 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. హెలికాప్టర్ దిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజా, మంత్రి జోగి రమేష్, స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు కొడాలి వేంకటేశ్వరరావు (నాని), వల్లభనేని వంశీ, కొక్కిలిగడ్డ రక్షణనిధి, కై లే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, సామినేని ఉదయభాను, కొలుసు పార్థసారథి, మేకా ప్రతాప్ అప్పారావు, మొండితోక జగన్మోహనరావు, వసంత కృష్ణప్రసాద్, ముదునూరు ప్రసాదరాజు, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మర్రి రాజశేఖర్, కల్పలత, పోతుల సునీత, మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆర్టీసీ రీజియన్ చైర్మన్ తాతినేని పద్మావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజితసింగ్ తదితరులు స్వాగతం పలికారు. అలాగే సభ ముగించుకుని హెలీప్యాడ్ ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు 12.26 గంటలకు తిరిగి వచ్చిన సీఎం జగన్‌కు మంత్రి జోగి రమేష్, ఎంపీలు వల్లభనేని బాలశౌరి, అయోధ్య రామిరెడ్డి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కొలుసు పార్థసారథి, సామినేని ఉదయభాను, సింహాద్రి రమేష్‌బాబు, పేర్ని కిట్టు, ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు వీడ్కోలు పలికారు. హెలికాప్టర్ గాలిలోకి ఎగిరే 1.30 గంటల సమయంలో సీఎం జగన్ ఆ ప్రాంతంలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేశారు. హెలికాప్టర్ ఎక్కే ముందు మచిలీపట్నం నియోజకవర్గంలోని నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, సర్పంచులు తదితర ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే పేర్ని నాని సీఎం జగన్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రజాప్రతినిధులను సీఎం జగన్ పేరుపేరున పలుకరిస్తూ వారితో మాట్లాడారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం జగన్‌రాక సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లు



సీఎం జగన్‌కు పూలు జల్లుతూ స్వాగతం పలుకుతున్న ప్రజలు

రోడ్డు షోకు విశేష స్పందన

పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి జిల్లా పరిషత్ సమీపంలోని స్కాట్స్ అండ్ గైడ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో నిర్వహించిన రోడ్డు షో లో సీఎంతో పాటు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన తనయుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా మహిళలు బారులుతీరి సీఎం జగన్‌పై పూలవర్షం కురిపించారు. సీఎం జగన్ వారికి అభివాదం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొడుతూ ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా ముందుకు సాగారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు వేచివున్న ప్రజలు



పడవలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

సీఎంకు జ్ఞాపికలు అందజేసిన మేయర్, డెప్యూటీ మేయర్లు



సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్లు వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మీ, శీలం భారతి. చిత్రంలో ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): నిర్మాణ పనులు ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహిరంగ సభ అనంతరం మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కార్పొరేటర్లు చిటికిన వెంకటేశ్వరమ్మ, మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి జ్ఞాపికలు అందజేశారు. ముస్లిం సామాజికవర్గం తరపున టోపీ ధరించి ఇమామే జామను (రక్ష బంధాన్ని) వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా కట్టారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు సీఎంను దుశ్శాలువాతో సత్కరించారు.

నేడు గణపేశ్వరంలో గడప గడపకు మన ప్రభుత్వం

నాగాయలంక: అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మంగళవారం నాగాయలంకలో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. మండలంలోని గణపేశ్వరం సచివాలయం పరిధిలో మధ్యాహ్నం మూడు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు.

చికిత్స పొందుతూ అవనిగడ్డ వాసి మృతి

కొల్లూరు: రోడ్డు ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం ఏకనూరుకు చెందిన తూగల శ్రీనివాస పెరుమాళ్లు (62) ఈ నెల 10న తన ద్విచక్ర వాహనంపై గుంటూరుకు వ్యక్తిగత పనిపై వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మండలంలోని దోనేపూడిలో కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవడంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వైద్యశాల నివేదిక, మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజీవ్‌శామ్యూల్‌కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా ఈ ఏపీసెట్ అగ్రికల్చర్ పరీక్ష

పెడన: నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఈ ఏపీ సెట్ -2023 అగ్రికల్చర్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు 131 మందికి 124 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 131 మందికి 123 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, పరీక్ష కేంద్రం అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు.

టిడ్కో ఇళ్ల అనర్హులకు సొమ్ము వాపస్ చేస్తాం

గుడివాడ టౌన్: టిడ్కో ఇళ్ల కేటాయింపుల్లో వసూలు చేసిన మొత్తాల్లో అనర్హుల సొమ్ము తిరిగి చెల్లించేందుకు పురపాలక సంఘం నిర్ణయం తీసుకుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. కొన్ని కారణాల వలన 2018లో తయారు చేసిన జాబితాలో కొందరు పట్టణం విడిచి వెళ్లిపోయారని, లబ్ధిదారుల్లో కొందరు 40 ఏళ్ల వయస్సు నిండిన వారు ఉండటంతో వారికి బ్యాంకు రుణం అర్హత వయస్సు దాటిపోవడం వంటి కారణాలతో వారిని అనర్హులుగా గుర్తించామన్నారు.

125 మందికి వైద్య పరీక్షలు

నడకుదురు(చల్లపల్లి): నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంలో సోమవారం గ్రేస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ స్వర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భవానీ, డాక్టర్ వినీత, డాక్టర్ నాగమల్లేశ్వరరావు 125 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. దైవ సేవకులు గోల్కొండ ఏసురాజు శిబిరాన్ని ప్రారంభించారు.

శిబిర నిర్వాహకుడు పాస్టర్ డేవిడ్ గోల్కొండ, ఆస్పత్రి పీఆర్‌ఓ రాజారత్నం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. విశ్రాంత డీఎస్పీ కె.హరి రాజేంద్రబాబు, నలిగిలి విజయరాజు, సుబ్బారావు, డి.రమణయ్య, రాజు సహకరించారు.



మందులు అందిస్తున్న గోల్కొండ డేవిడ్, రాజారత్నం

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో కృష్ణా-గుంటూరు జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. సోమవారం పెదకళ్లేపల్లి జట్టు, రాముడుపాలెం జట్లు తలబడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన పెదకళ్లేపల్లి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 88 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాముడుపాలెం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 89 పరుగులు సాధించి విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు నాగేంద్ర సాధించాడని నిర్వాహకులు యన్నం హరి, నరేష్ తెలిపారు.

దయాకర్‌కు ఎమ్మెల్సీల పరామర్శ



మచిలీపట్నంటౌన్: ఇటీవల కుమారుడిని కోల్పోయిన ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్‌ను ఎమ్మెల్సీలు పి. కల్పలత, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి సోమవారం పరామర్శించారు. నగరంలోని దయాకర్ ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు ప్రిన్స్ దేవానంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవానంద్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. లేడీయాంప్తిల్ కళాశాల కాంట్రాక్ట్ లెక్చరర్లు మున్వర్, జాషువా, సురేష్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజారామ్మోహన్‌రాయ్‌కు ఘన నివాళి

మచిలీపట్నంటౌన్: సమాజంలోని దురాచారాలను రూపుమాపేందుకు రాజారామ్మోహన్‌రాయ్ ఎంతగానో కృషి చేశారని అజ్మీర్ బాబా దర్గా సేవా సమాజం అధ్యక్షుడు సయ్యద్ పీర్ అన్నారు. రాజారామ్మోహన్‌రాయ్ జయంతి కార్యక్రమం సోమవారం సమాజం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సయ్యద్‌పీర్ మాట్లాడుతూ సతీసహగమనాన్ని రూపుమాపేందుకు వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారని చెప్పారు. ఆనాడు సమాజంలో నెలకొన్న దురాచారాలు, మూఢనమ్మకాలను రూపుమాపేందుకు ఎంతగానో కృషి చేశారని వివరించారు. నాగలింగం నాగేశ్వరరావు, అమన్, రవి, షేర్‌అలీ, ఇస్మాయిల్, రాజకమల్, ప్రసాద్, నితిన్ పాల్గొన్నారు.